పసిడి కాంతుల భానుడు

మన్యంలో అందాలు కట్టిపడేస్తున్నాయి. గసభ పంచాయతీ మొర్రిగుడ ప్రాంతంలో సూర్యోదయ వేళ భానుడు మంచు తెరల మధ్య పసిడి వర్ణంలో లేలేత కిరణాలతో ఆకట్టుకున్నాడు. ఈ దృశ్యాలను ప్రకృతి ప్రేమికులు తమ సెల్‌ఫోన్లతో ఫొటోలు తీసి పదిలపరచుకున్నారు. –డుంబ్రిగుడ



కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించండి

వీడియో సమావేశంలో రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ మీనా ఆదేశం

8లో



న్యూస్‌రీల్

పరిసరాల పరిశుభ్రత పాటించాల్సిందే

- లేకుంటే చర్యలు
- అసిస్టెంట్ కలెక్టర్ అనుతోష్ శ్రీవాస్తవ హెచ్చరిక



గిరిజన మ్యూజియంలో పర్యటిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాస్తవ

అరకులోయ రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించకుంటే చర్యలు తప్పవని అసిస్టెంట్ కలెక్టర్ అనుతోష్ శ్రీవాస్తవ హెచ్చరించారు. గురువారం ఆయన అరకులోయలో పర్యటించారు. వివిధ ప్రైవేట్ హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గిరిజన మ్యూజియాన్ని ఆయన సందర్శించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పర్యాటకులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమలయ్యేలా కృషిచేయాలని సూచించారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటేష్, సర్పంచ్ దాసుబాబు, ఎంపీటీసీ భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షలకు 25 వరకు ఫీజు గడువు

పెదబయలు: దక్షిణ భారత్ హిందీ ప్రచారసభ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించే హిందీ పరీక్షలకు ఫీజు ఈ నెల 31వ తేదీలోగా చెల్లించాలని హిందీ ప్రచారక్ పాంగి పాల్గుణ తెలిపారు. పరిచయ, ప్రాథమిక నుంచి రాష్ట్ర భాష పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ మేరకు ఫీజులు చెల్లించాలని కోరారు. గడువు మించితే అపరాధ రుసుంతో ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9493531174 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ రవిబాబు, ఎమ్మెల్యేలు ధనలక్ష్మి

రంపచోడవరం: క్రీస్తు బోధనలు ఆచరణీయమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు తెలిపారు. రంపచోడవరం ఎస్టీ కాలనీలో గురువారం నిర్వహించిన ఐక్య క్రిస్మస్ వేడుకల్లో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మితో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ క్రీస్తు బోధనల ఆచరణతో సమాజంలో శాంతి నెలకొంటుందని చెప్పారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టీఫెన్ టి.ఎల్.రావు, పాస్టర్లు జోసఫ్ పాల్, చంద్రపాల్, మనోహర్,మణికుమార్, హెస్సబాబు, జి.పాలు తదితరులు పాల్గొన్నారు.



నిర్వహణ లోపమే శాపం

రూ.కోట్లలో ఆదాయం వచ్చే పవర్ ప్రాజెక్టుల్లో నిర్వహణలోపం మరోసారి తేటతెల్లమైంది. డొంకరాయి పవర్ కెనాల్‌కు గండి విషయంలో ఇదే స్పష్టమైంది. విద్యుత్ ఉత్పత్తిలో కీలకమైన పవర్ కెనాల్‌కు కారణం ఏదైనా.. కొన్నేళ్లుగా పూర్తిస్థాయిలో నిర్వహణ కరువైంది. దీంతో రూ.కోట్ల మేర నష్టాన్ని మూల్యంగా చెల్లించుకోవాల్సి వచ్చింది.

- డొంకరాయి పవర్ కెనాల్‌కు గండి
- ఏడేళ్లుగా పూర్తిస్థాయిలో చేపట్టని మరమ్మతులు
- రెండు ప్రాజెక్టుల్లో విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం
- గండి ప్రాంతాన్ని పరిశీలించిన హైడల్ ఇంజినీరింగ్ అధికారులు
- నీటి సరఫరా పునరుద్ధరణకు రెండు నెలలు పట్టే అవకాశం

మోతుగూడెం: డొంకరాయి పవర్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడం, నిర్వహణ లోపం కారణమే గండి పడి ఏపీ జెన్‌కోకు భారీ నష్టం వాటిల్లడానికి కారణమని వినవస్తోంది. పవర్ కెనాల్‌కు 3/6 రీచ్ వద్ద బుధవారం అర్ధరాత్రి భారీ గండి పడింది. దీంతో డొంకరాయి, పొల్లూరు ప్రాజెక్టుల్లో 500 మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి



గండిపేట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడల్ డైరెక్టర్ ఎం.వీవీ సత్యనారాయణ, అధికారులు

నిలిచిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పవర్ కెనాల్ నిర్వహణకు రూ.2 కోట్లు వెచ్చించారు. అయితే అంతకుముందు ఏడేళ్ల నుంచి పవర్ కెనాల్ మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో కాలువ బలహీనపడి నీటి ఒత్తిడి వల్లే కోతకు గురైందని చెబుతున్నారు.

- నిబంధనల ప్రకారం ఏటా క్రమం తప్పకుండా రిజర్వాయర్‌లో కనిష్ఠ స్థాయికి నీటి నిల్వలు చేరుకున్న తరువాత మరమ్మతు పనులు చేపట్టాలి.
- కొన్నేళ్లగా ఈ ప్రక్రియ జరగడం లేదు. తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. దీంతో పవర్ కెనాల్ కట్టలు బలహీనంగా మారాయి. భారీ కోతకు గురై గండిపడుతున్నాయి.
- పవర్ కెనాల్‌కు 16 కిలోమీటర్ల మేర కాలువ అంచులు, అక్విడెక్టులు, యూటీల వద్ద ఎటువంటి పొదలు, చెట్లు పెరగకుండా చర్యలు చేపట్టాలి.
- ఏడాదిలో నాలుగైదు సార్లు జంగిల్ కటింగ్ పనులు చేపట్టాలి. అయితే కొన్నేళ్లుగా నిధుల కొరతను కారణంగా చూపి ఈ ప్రక్రియ చేపట్టడం లేదు. దీంతో లీకేజీ ఎక్కడ వస్తుందో తెలియడం లేదు.
- సిబ్బంది కొరత కారణంగా పవర్ కెనాల్ లీకేజీలు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా కెనాల్‌కు ఇంజనీర్ల పర్యవేక్షణ కూడా కరువైందన్న విమర్శలున్నాయి.

రెండు పవర్ ప్రాజెక్టులపై ప్రభావం

సీలేరు కాంప్లెక్సు పరిధిలో మాచ్‌ఖండ్, సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. డొంకరాయి పవర్ కెనాల్ ద్వారా నీరు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి రావాలి. పవర్ కెనాల్‌కు గండి పడడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో డొంకరాయి పవర్ ప్రాజెక్టులో 25 మెగావాట్లు, పొల్లూరు పవర్ ప్రాజెక్టులో 460 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో రూ.కోట్లలో ఏపీ జెన్‌కోకు నష్టం వాటిల్లింది.

2019లో రూ.80 కోట్ల మేర నష్టం

డొంకరాయి పవర్ కెనాల్‌కు 2019లో రోడ్డు బ్రిడ్జి వద్ద గండి పడింది. దీంతో అప్పటిలో ఏపీ జెన్‌కోకు సుమారు రూ.80 కోట్ల మేర నష్టం జరిగింది. ఈ గండిని పూడ్చడానికి రూ.6 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం పవర్ కెనాల్‌కు పడిన గండి పూడ్చేందుకు రెండు నెలలు సమయం పట్టే అవకాశం ఉందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అప్పటివరకు విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే హైడల్ ఇంజినీరింగ్ అధికారులు గండి పూడ్చివేతకు ఏర్పాట్లు చేస్తున్నారు.



గండిపేట ప్రదేశంలో కాలువను ఆనుకొని అడవిని తలపిస్తున్న పిచ్చి మొక్కలు

క్రీడలకు పూర్తిస్థాయిలో ప్రోత్సాహం

- ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్‌సీసీ శిక్షణ కేంద్రం ఏర్పాటు యోచన
- చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిశోర్
- విజేతలకు బహుమతుల ప్రదానం



చెక్కు అందిస్తున్న ఏఎస్పీ ప్రశాంత్ శివకిశోర్

సీలేరు: మన్యంలో గిరిజన యువతీ యువకులు క్రీడల్లో దేశస్థాయిలో పోటీపడాలని, అందుకు ప్రోత్సాహం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చింతపల్లి ఏఎస్పీ ప్రశాంతి శివకిశోర్ అన్నారు. జీకె.వీధి మండలం మాదిగమళ్లు గ్రామంలో యువహో వాలీబాల్ పోటీల్లో 86 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతిగా కొత్తపాకల జట్టుకు రూ.25వేలు, ద్వితీయ బహుమతిగా సీలేరుకు రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలతో పాటు షీల్డ్, డ్రస్‌కోడ్, వాలీబాల్ కిట్లు గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ సతీష్‌కుమార్ చొరవతో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో చర్చించి మన్యంలో గిరిజన యువకులకు క్రీడా అసోసియేషన్ ఏర్పాటు చేసిన రూ.10 లక్షల నిధి సమకూర్చామని చెప్పారు. దీని ద్వారా మారుమూల ప్రాంతాల్లో క్రీడల్లో యువతకు ప్రోత్సాహం అందించేందుకు కలెక్టర్ హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఏజెన్సీలో ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ల ద్వారా ఎన్‌సీసీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉందన్నారు. దీనివల్ల ఉద్యోగాలకు వెళ్లే యువకులకు మరిన్ని అదనపు మార్కులు లభిస్తాయన్నారు.ఈ పోటీలకు పెద్ద ఎత్తున గిరిజన యువకులు పాల్గొనడం ఆనందంగా ఉందని, మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. యువత చెడుమార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరావు, గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ కె.అప్పలసూరి, సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

అధికారులకు ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశం



సమీక్షిస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాల అమలుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. మండలంలో మూడేళ్ల అభివృద్ధిపై గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్షించారు. శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు చేరవేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు ఎటువంటి అర్జీలు పెట్టుకున్నా తక్షణమే పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ప్రభుత్వాశయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందని, దానికి అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ నర్సమ్మ, ఎంఈవో చెల్లయ్య, సీడీపీవో రాజేశ్వరి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గురుకుల విద్యార్థి మృతి



కొండబాబు (ఫైల్)



మృతి చెందిన గురుకుల విద్యార్థి కొండబాబు

జి.మాడుగుల: స్థానిక గురుకుల పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన జర్తా కొండబాబు అనే విద్యార్థి గురువారం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల ఆరవ తేదీ సాయంత్రం గురుకుల పాఠశాల ఆవరణలో విద్యార్థి జర్తా కొండబాబు రాగి మాల్ట్ సేవిస్తుండగా అదే సమయంలో సాయిశరత్ వాలీబాల్ ఆడుతుండగా బంతి వెళ్లి కొండబాబు ముఖంపై బలంగా తగిలింది. ఈ విషయమై ఇద్దరు విద్యార్థుల మధ్య కొద్ది సేపు ఘర్షణ జరిగింది. అదే రోజు రాత్రి సాయిశరత్ తన స్నేహితుడు ఎం.దిలీప్‌తో కలసి నిద్రిస్తున్న కొండబాబుపై దాడికి పాల్పడటం తెలిసిందే. గాయపడిన కొండబాబును ఇక్కడ పాఠశాల ఉపాధ్యాయుడు, హెల్త్ అసిస్టెంట్ పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. కొండబాబును స్వగ్రామం పెదబయలు మండలం మల్లెపుట్టు గ్రామానికి పంపించేశారు. ఇంటికి వెళ్లిన విద్యార్థి ఆరోగ్య విషమించడంతో తల్లిదండ్రులు బుధవారం పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. కొండబాబుకు మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనపై స్థానిక ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఘటనకు యాజమాన్య నిర్లక్ష్యమే కారణమా?

పాడేరు రూరల్: విద్యార్థి మృతి చెందిన ఘటనలో గురుకుల పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ముగ్గురు విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణను పాఠశాల యాజమాన్యం పెద్దగా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. తీవ్రంగా గాయపడిన విద్యార్థి కొండబాబుకు మరుసటి రోజు జి.మాడుగుల ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సలు చేసి స్వగ్రామమైన మల్లెపుట్టు గ్రామానికి పంపించి పట్టనట్టు యాజమాన్యం వ్యవహరించిందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సంఘటన జరిగిన రోజు నుంచి గురుకుల పాఠశాల యాజమాన్యం స్పందించి సకాలంలో వైద్య చికిత్సలు కల్పించి ఉంటే తమ కొడుకు మృతి చెందేవాడు కాదని తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

పోలవరం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు



గ్రామ సభలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు

వీఆర్‌పురం: ఈ నెల 22న నిర్వహించనున్న పీఎస్–2 గ్రామ సభలో పట్టాదారులు ముసాయిదా ధ్రువీకరణను పరిశీలించుకొని రాతపూర్వకంగా అభ్యంతరాలు తెలపవచ్చని పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ) వి.స్వామినాయుడు అన్నారు. రేఖపల్లిలో గురువారం నిర్వహించిన పీఎస్–1 గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ముసాయిదాలోని పొందుపరచిన పట్టాదారుల పేర్లను సభలో వెల్లడించారు. అనంతరం పలువురి నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శ్రీధర్, ఎంపీపీ కారం లక్ష్మి , రేఖపల్లి ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, సర్పంచ్‌లు పిట్టా రామారావు, పూనెం సరోజిని, ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గాంధీబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం



జి.మాడుగుల పీహెచ్‌సీలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌వో లీలాప్రసాద్

జి.మాడుగుల: గిరిజన ప్రాంతాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో నిర్వహించే వైద్య శిబిరాలకు రోగులను తీసుకువచ్చిన మెరుగైన వైద్యం అందించాలని పాడేరు ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె లీలాప్రసాద్ ఆదేశించారు. మండలంలో గెమ్మెలి పీహెచ్‌సీ పరిధిలో ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య శిబిరాన్ని గురువారం ఆయన పరిశీలించారు. 104వాహనం ద్వారా రోగులకు అందిస్తున్న సేవలను, వైద్య పరీక్షలను తనిఖీ చేశారు. వంతాల గ్రామ సచివాలయం పరిధిలో వేలంగరువు గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో ఆశా కార్యకర్తపై వచ్చిన ఫిర్యాదుపై ఆయన విచారణ జరిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం జి.మాడుగుల పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను వివరాలను తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో మందుల నిల్వలు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గెమ్మెలి, జి.మాడుగుల పీహెచ్‌సీల వైద్యాధికారులు నగేష్, రవిచంద్ర శేఖర్, పాడేరు ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, పాడేరు: జిల్లాలోని 49 అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈనెల 17 నుంచి 27 సాయంత్రం 5గంటల వరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థులు టెన్త్ ఉత్తీర్ణులై స్థానికంగా వివాహిత మహిళ అయి ఉండాలన్నారు. 2022 జూలై ఒకటికి అభ్యర్థులు 21 సంవత్సరాలు పూర్తయి 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు సంబంధించి ఖాళీలు, దరఖాస్తుల నమూనా, నిబంధనలు తెలుసుకునేందుకు సంబంధించి ఐసీడీఎస్ కార్యాలయాలను సందర్శించాలని కలెక్టర్ కోరారు. ఈ పోస్టుల నియామకాలు పారదర్శకంగానే జరుగుతాయని మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కలెక్టర్ కోరారు. అభ్యర్థుల ధ్రువపత్రాలు, మార్కుల ఆధారంగానే ఈ పోస్టుల నియామకాలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు.

భక్తులకు సంతృప్తికర దర్శనం

- అదే దేవదాయ శాఖ సిబ్బంది లక్ష్యం కావాలి
- భూముల పరిరక్షణలో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది
- పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు
- సింహాచలం దేవస్థానం అధికారులకు హెచ్చరించిన
- దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

సింహాచలం: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సింహాచలం దేవస్థానం అధికారులను రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ గట్టిగా హెచ్చరించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని గురువారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం శ్రీకృష్ణాపురంలోని నృసింహవనంలో భీమిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్ లాల్‌తో కలిసి దేవస్థానంలో విభాగాల వారీగా అధికారుల పనితీరుపై సమీక్ష చేశారు. ఈ తరుణంలో వారి నుంచి వచ్చిన సమాధానాలతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆక్రమణల్లో అధికారుల ప్రమేయం?

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం భూములు అన్యాక్రాంతం అయ్యాయంటే.. దానికి మూడొంతుల బాధ్యత దేవస్థానం అధికారులే తీసుకోవాలని మంత్రి సూచించారు. అధికారుల ప్రమేయం లేకుండా అంగుళం భూమి కూడా ఆక్రమించే సాహసం ఎవరూ చేయరన్నారు. ఇక్కడి అధికారులు అవలంబిస్తున్న విధానం ప్రభుత్వానికి గుదిబండలా మారిందని, దేవుడికి అన్యాయం జరిగే పరిస్థితి ఉందన్నారు. ఓ పక్క శిథిలావస్థలో ఉన్న ఇళ్ల మరమ్మతులు చేసుకుంటామనే వారికి అవకాశం కల్పించకుండా, ఆ పక్కనే కోర్టు పర్మిషన్‌తో అంతస్తుల మీద అంతస్తులు కట్టేస్తుంటే చూస్తూ ఉండాల్సిన పరిస్థితి తీసుకొచ్చారన్నారు. దీన్ని బట్టి అధికారుల్లో అస్మదీయులు, తస్మదీయులు ఉన్నారనే విషయం అర్థమవుతోందన్నారు. కోర్టు పర్మిషన్ ఇచ్చినా దేవస్థానం తరఫున తదుపరి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సంబంధిత ఏఈవోలను ప్రశ్నించారు. ఇదంతా ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నట్లు ఉందన్నారు.

ఫిర్యాదు వస్తే కఠిన చర్యలు

భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత దేవస్థానం అధికారులపై ఉందని మంత్రి స్పష్టం చేశారు. టికెట్టు తీసుకుంటానన్న భక్తుడికి కౌంటర్ల వద్ద కనీసం గౌరవం ఇవ్వలేని పరిస్థితి దేవస్థానంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై భక్తులు తనకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేశారన్నారు. 22 టికెట్టు కౌంటర్లలోనూ అన్ని షిఫ్టుల్లో సిబ్బంది పనిచేయాలని, భక్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారిపై చర్యలు తప్పవన్నారు. శానిటేషన్‌కు రోజుకు రూ.60 వేలు బడ్జెట్ కాగా.. దీనిని సంబంధించి ఏం పనులు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతి రోజూ 1000 మెట్లు శుభ్రం చేయాలని సూచించారు. స్వామి అలంకరణ విషయంలో రాజీ పడొద్దని అధికారులకు మంత్రి ఆదేశించారు. అవసరమైతే బడ్జెట్ పెంచుతామన్నారు. దేవస్థానానికి త్వరలోనే పూర్తిస్థాయి ఈవోను నియమిస్తామన్నారు. సమీక్షలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ తిరుపతి తరహాలో ప్రతి నెలా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు ప్రవేశపెట్టాలని సూచించారు. స్వామికి నిత్యాలంకరణ చేయాలన్నారు. దేవస్థానం ఈవో త్రినాథరావు, అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

నెలకు లక్ష మందికి అన్నదానం

ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆలయానికి వచ్చే ప్రతీ భక్తుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంతృప్తితో తిరిగి వెళ్లేలా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అన్నదాన విభాగంలో నెలకు లక్షమందికి భోజనం పెట్టేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. దేవస్థానానికి చెందిన గోశాలను పూర్తిస్థాయిలో పరిరక్షించాలని సూచించినట్లు చెప్పారు. ఆగమశాస్త్రం ప్రకారం ఆలయంలో కైంకర్యాలు, సేవలు జరగాలని స్పష్టం చేశామన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో రానున్న జనవరి 31వ తేదీ కల్లా క్యాష్‌లెస్ టికెట్లు, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు.

గిరిజన హక్కుల పరిరక్షణే లక్ష్యం

- ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు
- కాకవాడ ఆశ్రమ పాఠశాల సందర్శన
- విద్యార్థినిని వేధించిన హెచ్‌ఎం భర్తపై పోక్సో, అట్రాసిటీ కేసు
- పోలీసులకు ఆదేశం



కాకవాడ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

రంపచోడవరం: గిరిజనుల హక్కులను కాపాడడమే ఎస్టీ కమిషన్ లక్ష్యమని, వారి విషయంలో ఎవరు తప్పు చేసినా ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు హెచ్చరించారు. గురువారం ఇక్కడికి వచ్చిన ఆయన మండలంలోని కాకవాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థినిపై వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎం భర్త ప్రసాద్‌పై పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఇప్పటివరకు అతనిని అరెస్టు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ విషయంలో జాప్యం జరిగితే డీజీపీకి రిపోర్ట్ చేస్తానని వారిని హెచ్చరించారు. స్థానిక పర్యాటకశాఖ అతిథి గృహానికి విచ్చేసిన ఆయనకు వేములకొండ సర్పంచ్ కొమరం పండుదొర, రైట్స్ వాచ్ చైర్మన్ బాలు అక్కిన కాకివాడ ఘటనపై ఫిర్యాదు చేశారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మితో కలిసి కాకవాడ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ముందుగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. తరువాత విద్యార్థినుల నుంచి వివరాలు సేకరించారు. స్నానాలు చేస్తుంటే హెచ్‌ఎం భర్త వీడియో తీసేవారని బాలికలు కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో కమిషనర్ చైర్మన్ ఇవేవీ మీకు కనిపించలేదా అంటూ గిరిజన సంక్షేమ అధికారులు, పోలీసులపై సీరియస్ అయ్యారు. ఒక గిరిజనేతరుడు స్కూల్ వద్ద ఇలాంటి దారుణానికి పాల్పడితే గిరిజన సంక్షేమ అధికారులు ఏం చేస్తున్నట్టు అంటూ ఆగ్రహానికి గురయ్యారు. ముసురుమిల్లి ఆశ్రమపాఠశాల హెచ్‌ఎం కేఆర్‌పీ కుమార్ తమపై ఒత్తిడి తెచ్చి హెచ్‌ఎం భర్త ఆశ్రమ పాఠశాలలో ఉండటంలేదని రాసి ఇమ్మన్నారని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. హెచ్‌ఎం భర్తకు ఆశ్రమ పాఠశాలతో సంబంధం ఏమిటని గిరిజన సంక్షేమ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. డివిజన్‌స్థాయి అధికారులు పర్యటనకు హాజరుకాకపోవడంపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. త్వరలో రంపచోడవరంలో ఎస్టీ కమిషన్ సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఏజెన్సీలో బాలికలకు భద్రత కల్పించేందుకు కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా పప్పులో బొప్పాయి ముక్కలు వేసి వండి పెడుతుంటే గిరిజన సంక్షేమ అధికారులు ఏం చేస్తున్నారు.. ఇదేనా మీ పర్యవేక్షణ అంటూ సీరియస్ అయ్యారు. గిరిజనులకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు కమిషన్ పనిచేస్తుందన్నారు.

ఇన్‌చార్జి హెచ్‌ఎంకు పూర్తి బాధ్యతలు: ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రస్తుతం ఇంచార్జ్ హెచ్‌ఎంకు పూర్తి బాధ్యతలు అప్పగించాలని ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆదేశించారు. మూడు నెలలకు ఒకసారి వార్డెన్‌ను మార్చే పద్ధతి విరమించాలని ఆమె సూచించారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు ఉలవలక్ష్మి, కుంజం వంశీ, పార్టీ నాయకులు పండా రామకృష్ణదొర, నందూరి రాంబాబు ,తదితరులు ఉన్నారు. ఇలావుండగా హెచ్‌ఎం భర్తపై పోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేసినట్టు సీఐ సురేష్ బాబు తెలిపారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

కాకవాడ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె. పావనిని సస్పెండ్ చేసినట్లు డీడీ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. హెచ్‌ఎంపై వచ్చిన అభియోగాల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

ముగిసిన జగనన్న స్వర్ణోత్సవాలు

విజేతలకు 20న నగదు బహుమతుల ప్రదానం


గానం చేస్తున్న కళాకారిణి


జానపద నృత్యం

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరిగిన ఈ పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమలోని ప్రతిభను ప్రదర్శించారు. తప్పెటగుళ్లు, భరతనాట్యం, జానపద నృత్యం, పులి వేషాలు, బుర్ర కథలు, కాళికావేషాలు, కర్ణాటక సంగీతం, లలిత సంగీతం, కూచిపూడి తదితర కళారూపాలను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. జోనల్ స్థాయిలో విజేతలుగా నిలిచిన కళాకారులు ఈ నెల 19, 20వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. జోనల్‌స్థాయి విజేతలకు ఆ రోజు నగదు బహుమతులు ప్రదానం చేస్తారు.

జోనల్‌స్థాయి విజేతలు వీరే

కళారూపం	విజేత పేరు	జిల్లా	నగదు బహుమతి
కూచిపూడి	ఆర్.శ్రీకాంత్(బృందం)	శ్రీకాకుళం	రూ.25,000
కూచిపూడి	ఎం.శ్రీ రవళి(సోలో)	విశాఖపట్నం	రూ.10,000
భరత నాట్యం	టి.తన్మయి(బృందం)	విజయనగరం	రూ.25,000
భరత నాట్యం	డి.నేహ(సోలో)	శ్రీకాకుళం	రూ.10,000
జానపద సంగీతం	పి.పాపరత్నం(బృందం)	విజయనగరం	రూ.25,000
జానపద సంగీతం	బి.శివకుమార్	విజయనగరం	రూ.10,000
కోలాటం	ఎన్.లక్ష్మీ బృందం	శ్రీకాకుళం	రూ.25,000
థింసా	పొద్దు అర్జున్(బృందం)	అల్లూరి సీతారామరాజు	రూ.25,000
పులివేషాలు	పైడిమాంబ(బృందం)	విజయనగరం	రూ.25,000
కాళికావేషాలు	బాలాజీ బాబు (బృందం)	అల్లూరి సీతారామరాజు	రూ.25,000
తప్పెటగుళ్లు	నేలబోను సత్యం (బృందం)	విజయనగరం	రూ.25,000
జానపద నృత్యం	గాయత్రి (బృందం)	శ్రీకాకుళం	రూ.25,000
జానపద నృత్యం	జి.ప్రవల్లిక (సోలో)	విజయనగరం	రూ.10,000
కర్ణాటక సంగీతం	ఎస్.పార్థివ	విశాఖపట్నం	రూ.10,000
లలిత సంగీతం	ఎ.లక్ష్మీ శైలజ	విశాఖపట్నం	రూ.10,000



నృత్యం చేస్తున్న కళాకారులు

తప్పుడు వార్తలతో ప్రజలను మభ్యపెట్టలేరు


వలంటీర్ల సంఘం అధ్యక్షుడు పరమేశ్వరరావు

చింతపల్లి: దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న వలంటీర్ల వ్యవస్థపై ఈనాడు దినపత్రిక అసత్య వార్తలు ప్రచురించడం సిగ్గుచేటని మండల వలంటీర్ల సంఘం అధ్యక్షుడు పరమేశ్వరరావు అన్నారు. గ్రామ స్థాయిలో ఇంటి వద్దే ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి, సేవలు అందిస్తుంటే తమను కించపరిచేలా వార్తలు రాసి తమ ఆత్మస్థైర్యం దెబ్బతీయాలను కుంటోందని, ఇటువంటి వార్తలతో ప్రజలను మభ్యపెట్టలేరని తెలిపారు. తాము ఏ విధంగా సేవలు అందిస్తున్నామో ప్రజలకు తెలుసన్నారు. తమ సేవలను కించపరిస్తే సహించేది లేదన్నారు. కరోనా సమయంలో తాము అందించిన సేవలు కనిపించలేదా, ఇంటి వద్దకే పింఛన్ తీసుకువెళ్లి ఇవ్వడం తప్పా అని ప్రశ్నించారు. జన్మ భూమి కమిటీలు చేసిన దోపిడీపై వార్తలు ఎందుకు రాయలేదన్నారు. వలంటీర్లలో కూడా చాలా మంది మీరు మద్దతు ఇస్తున్న టీడీపీ అభిమానులు ఉన్నారని, వారు కూడా మీ దిగజారుడు వార్తలు చూసి నవ్వుకుంటున్నారన్నారు.

నర్సీపట్నం ఆర్డీవోగా భవానీశంకర్



నర్సీపట్నం: నర్సీపట్నం ఆర్డీవోగా బిహెచ్.భవానీశంకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆర్డీవోగా పనిచేస్తున్న హెచ్.వి.జయరాం అనకాపల్లి సుజల స్రవంతి ప్రాజెక్టుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. భవానీశంకర్ సుమారు నెల రోజుల క్రితం సీఎం కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయనను తిరిగి యథాస్థానంలో నర్సీపట్నం ఆర్డీవోగా నియమించారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించండి

వీడియో సమావేశంలో రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ మీనా ఆదేశం

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా కచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. అమరావతి నుంచి గురువారం ఆయన కలెక్టర్ సుమిత్ కుమార్‌తో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ రెవెన్యూ, ఎన్నికల విభాగం అధికారులంతా గ్రామాల్లో ఇంటింటా తిరిగి కొత్త ఓటర్ నమోదుపై సర్వే నిర్వహించి ఆయా ఓటర్లను గుర్తించి కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కొత్త ఓటర్ నమోదును పారదర్శకంగా నిర్వహిస్తున్నామని అర్హులైన యువతకు కొత్త ఓటర్లుగా నమోదు చేస్తున్నామన్నారు. జిల్లాలో మూడు నియోజకవర్గాల పరిధిలో 1,35,417 పీవీటీజీ ఓటర్లు ఉన్నారని ఇప్పటికే 89వేల ఓటర్లను సర్వే చేశామన్నారు. ఇంటింటా సర్వేలో 16,719 కొత్త ఓటర్లను గుర్తించామన్నారు. ఫారం-6 ప్రకారం 46వేల ఓటర్లను పరిశీలన ఈనెల 23నాటికి పూర్తి చేసి సమగ్ర విచారణ ద్వారా రూపొందించిన విచారణ నివేదిక అందజేయాలని ఆదేశించారు. జాబితాలో 49,439 ఓటర్లకు ఒకే రకమైన ఫొటోలు ఉన్నాయని వాటిపై సమగ్ర విచారణ జరిపి నకిలీ ఓటర్లను తొలగిస్తామని ఆయన తెలిపారు. పట్టభద్రుల ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో దయానిధి పాల్గొన్నారు.

ఏపీ మినిస్టీరియల్ ఉద్యోగుల నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గం సభ్యులు

పాడేరు రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీ మండల పరిషత్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం పాడేరు తాలూకా యూనిట్ ఎన్నిక గురువారం ప్రశాంతంగా జరిగింది. పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల్లోని పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులు, పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎం.సన్యాసిరావు(పాడేరు), కార్యదర్శిగా డీజీఎస్ శ్రీనివాసరావు(పాడేరు), ఉపాధ్యక్షుడిగా పి.గౌరీశంకర్(జి.మాడుగుల), సంయుక్త కార్యదర్శిగా కె.కృష్ణారావు(జి.మాడుగుల), కోశాధికారిగా నీలిమ(పాడేరు), జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జి.పార్వతి, కె.ధనలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో పాటు సమర్థులైన నాయకులు ఎన్నికకావడంపై ఎన్నికల పరిశీలకులు రామకృష్ణ, పెదబయలు ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి పూర్ణయ్య, ఇతర నాయకులు నాగరాజు, నాగేశ్వరరావులు హర్షం వ్యక్తం చేశారు.

చిట్టీల పేరిట చీటింగ్

- రూ.2.50 కోట్ల మేర సభ్యులకు కుచ్చుటోపీ
- రాత్రికి రాత్రే ఉడాయించిన ప్రబుద్ధుడు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు


ఎస్‌ఐ భీమరాజుకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

మునగపాక: అందరినీ నమ్మించాడు. రెండేళ్లుగా అందరితో పరిచయాలు పెంచుకున్నాడు. కొంత మంది నుంచి చీటీలు కట్టించుకున్నాడు. మరికొంతమంది నుంచి నూటికి 2 రూపాయల వంతున వడ్డీకి నగదు తీసుకొని కోట్లాది రూపాయలతో ఉడాయించిన సంఘటన మండలంలోని వాడ్రాపల్లిలో చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం అందరికీ డబ్బులు ఇచ్చేస్తానంటూ నమ్మబలికి రాత్రికి రాత్రే ఇల్లు వదిలిపోవడంతో గురువారం బాధితులంతా ఎస్‌ఐ భీమరాజును ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి. వాడ్రాపల్లికి చెందిన శ్రీకాకుళం పూర్ణ చంద్రరావు తాపీమేస్త్రీగా పనిచేసేవాడు. 2020లో గ్రామంలో చీటీలు వేయడం ప్రారంభించారు. కొంతమంది నుంచి నగదును రూ.2 వడ్డీకి తీసుకునేవాడు. తీసుకున్న నగదుకు వడ్డీ సక్రమంగా చెల్లించేవాడు. దీంతో చాలా మంది పూర్ణ చంద్రరావు మాటలు నమ్మి లక్షలాది రూపాయలను అతనికి వడ్డీకి ఇచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు తామిచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగ్గా శనివారం అందరికీ డబ్బు ఇచ్చేస్తానంటూ పూర్ణచంద్రరావు నమ్మబలికాడు. చీటీల డబ్బుతో పాటు వడ్డీకి తీసుకున్న నగదును పోగుచేసి ఈ నెల 10న శనివారం రాత్రి పిల్లలతో సహా ఇంటి నుంచి పరారయ్యాడు. దీంతో విషయం తెలుసుకున్న బాధితులు లబోదిబో మన్నారు. పూర్ణచంద్రరావుకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. గురువారం బాధితులంతా మునగపాక పోలీసులను ఆశ్రయించారు. తమకు జరిగిన మోసాన్ని ఎస్‌ఐ చల్లా భీమరాజు దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన బాధితుల వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. కాగా బాధితుల నుంచి పోలీసులు సేకరించిన వివరాల ప్రకారం పూర్ణచంద్రరావు మోసగించిన మొత్తం రూ.రెండున్నర కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

పల్లెలను ప్రగతి పథంలో నడిపిద్దాం

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: పల్లెలను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేద్దామని, అందులో సర్పంచ్‌ల పాత్ర కీలకమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమైందని చెప్పారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యల గురించి సర్పంచ్‌లను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమస్యలపై సర్పంచ్‌లకు పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. వాటి పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకుని, వివిధ శాఖల ద్వారా నిధులు సమీకరించుకోవాలని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం విడుదల చేస్తోందని, ఆ నిధులతో అభివృద్ధి పనులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నోయిన, నీలకంఠం, జనార్ధన్, వసంత, భాగ్యవతి, త్రినాథ్, సుభాష్, లక్ష్మణరావు, నర్సింగరావు, రమేష్, పాలముతి, శివశంకర్, ఎంపీటీసీలు సాధూరాం, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు


అరకులోయలో దట్టమైన పొగమంచు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. చలిగాలులు అధికమయ్యాయి. పాడేరు మండలంలో మినుములూరులో 14 డిగ్రీలు, అరకులోయలో 16 డిగ్రీలు, చింతపల్లిలో 17.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే చింతపల్లి, జి. మాడుగుల, జీకే వీధి మండలాల్లో పలుచోట్ల గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి వర్షం కురిసింది.

ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

అనకాపల్లిటౌన్: ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలో ఇన్సెంటివ్ పద్ధతిలో పనిచేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా ఉద్యానవన అధికారి జి.ప్రభాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో డిగ్రీ పూర్తి చేసినవారికి ప్రాధాన్యమిస్తామని, వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ లేదా ఏ ఇతర డిగ్రీ పూర్తి చేసినవారు, బ్యాంకింగ్‌పై అవగాహన ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు జిల్లా రిసోర్స్‌పర్సన్‌గా పని చేయాల్సి ఉంటుందని, ఇన్సెంటివ్ పద్ధతిలో ఆర్థిక లబ్ధి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను పోస్ట్ ద్వారా, ఈ మెయిల్ dhoakp22@gmai.com ద్వారా కానీ పంపించవచ్చని సూచించారు.

108లో ప్రసవం


శిశువుతో 108 సిబ్బంది

పెదబయలు: మండలంలోని మారుమూల ఇంజరి పంచాయతీ గిండెలి గ్రామానికి చెందిన లకె హెస్తేరు 108 వాహనంలో ప్రసవించింది. హెస్తేరు నిండు గర్భిణి. గురువారం పురిటి నొప్పులు రావడంతో ఆమె భర్త కృష్ణారావు 108కి ఫోన్ చేశాడు. జి.మాడుగుల మండలానికి చెందిన 108 సిబ్బంది వెళ్లి, ఆమెను పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికమయ్యాయి. ఈఎన్‌టీ చంద్రశేఖర్, లక్ష్మణ ఆమెకు సుఖప్రసవం చేశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను జి.మాడుగుల పీహెచ్‌సీకి తరలించారు.


108 వాహనంలో ప్రసవించిన వెన్నెలకు బిడ్డను అందిస్తున్న సిబ్బంది

అడ్డతీగలలో...

అడ్డతీగల: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా అడ్డతీగల మండలం దుశ్శర్తికి చెందిన పల్లాల వెన్నెల అనే గర్భిణి గురువారం 108 వాహనంలో ఆడబిడ్డను ప్రసవించింది. ఈఎంటీలు వెంకట్, సురేష్, గవర్రాజు ఇతర సిబ్బంది ఆమెకు సహకరించారు. ప్రసవం అనంతరం తల్లీబిడ్డలకు అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ఏకలవ్య విద్యార్థుల తరలింపునకు చర్యలు

సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


ఏకలవ్య పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

చింతూరు: స్థానిక ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణం పూర్తయినందున కుందులూరు నుంచి ఇక్కడికి విద్యార్థులను పూర్తిస్థాయిలో తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. గురువారం ఆయన లక్కవరంలోని పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల భవన నిర్మాణం పూర్తయిందని త్వరలోనే సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాల ఆవరణను శుభ్రం చేయించాలని ఆయన సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన చింతూరులోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. ఐటీడీఏ కార్యాయలంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌కు గాయాలు


గాయాలైన సర్పంచ్ శ్రీను

బుచ్చెయ్యపేట: మండలంలోని కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీను రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం కేపీ అగ్రహారం నుంచి ద్విచక్ర వాహనంపై వడ్డాది బయలుదేరాడు. బంగారుమెట్ట జంక్షన్ దగ్గర మల్లింపులో చిన అప్పనపాలేనికి చెందిన సుంకరి నాయుడుబాబు వడ్డాది నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఇద్దరి వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరూ రోడ్డుపై పడిపోగా వాహనాలు దెబ్బతిన్నాయి. సర్పంచ్ శ్రీను కుడికాలు, కాలర్ బోన్‌కు, ఒంటిపైన గాయాలవగా విశాఖ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నాయుడుబాబు చోడవరం ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటన వార్త తెలుసుకున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సర్పంచ్‌ను ఫోన్‌లో పరామర్శించారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సర్పంచ్ శ్రీనును పరామర్శించారు.